క్లుప్తంగా

సంపూర్ణ పోషణ కిట్లు అందజేత



వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీదుర్గ

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పేదలను ఆరోగ్యవంతులను చేస్తుందని కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ అన్నారు. ఏలూరు రూరల్ మండలం కోటేశ్వరదుర్గాపురంలో శుక్రవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లలతోనే సమాజం అభివృద్ధి బాట పడుతుందన్నారు. దీన్ని గుర్తించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాలింతలు, గర్భిణులు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చొక్కాపు లక్ష్మీ, ఆయా గండి కనకదుర్గ, నాయకులు వర్రీ నారాయణ పాల్గొన్నారు.

ఈ-చలానాలు రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఆటో, క్యాబ్ వాహనాలపై విధించిన ఈ-చలానాలను రద్దు చేయాలని, అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన స్టాప్ లైన్ సీసీ కెమెరాలు నిలిపి వేయాలని ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా కార్యదర్శి జె.గోపి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య కోరారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని ఆటో, క్యాబ్ వాహనాల డ్రైవర్ల రిలే నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం వారు సందర్శించారు. రెండవ రోజు రిలే నిరాహార దీక్షలను డ్రైవర్లకు నిమ్మరసం ఇచ్చి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, సీపీఎం పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో మైత్రి క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు బండారు శ్రీనివాస్, పి.శ్రీనివాస్, పీఎస్ ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు ఆంజనేయులు, పాపినాయుడు పాల్గొన్నారు.

సోమవరప్పాడులో అగ్నిప్రమాదం

దెందులూరు: సోమవరప్పాడులో గురువారం రాత్రి కౌలురైతు చల్లపల్లి అమర్‌నాథ్‌కు చెందిన 18 ఎకరాల గడ్డివాము దగ్ధమైంది. దీనిపై బాధిత రైతులు ఏలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలార్పే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో దాదాపు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్టు ఏలూరు ఫైర్ ఆఫీసర్ వివరించారు. దీనిపై విచారణ నిర్వహిస్తున్నామన్నారు.

మీ వెంటే.. మేముంటాం

- ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని
- ఏలూరులో నాయకులు, కార్యకర్తలతో మమేకం
- 49, 50 డివిజన్‌లో ప్రత్యేకంగా సమావేశాలు



ఏలూరు 50వ డివిజన్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని, వేదికపై మేయర్ నూర్జహాన్, ఇడా చైర్మన్ బొద్దాని



సమావేశానికి హాజరైన ముఖ్య కార్యకర్తలు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, భవిష్యత్తులో పార్టీ కోసం కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు సముచిత స్థానం కల్పించేందుకు కృషి చేస్తామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని చెప్పారు. ఏలూరులో శుక్రవారం 49, 50 డివిజన్లల్లో వైఎస్సార్ సీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక కార్పొరేటర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ కార్యకర్తలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడంతో పాటు ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులు అండగా నిలవాలని కోరుతూ సమావేశాలు ఏర్పాటు చేశారు.

ఏలూరు 50వ డివిజన్‌లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, ఐదేళ్లుగా ఏలూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని స్థానికంగా ప్రజలకు వివరించాలని సూచించారు. ఏలూరు 49వ డివిజన్‌లో కార్పొరేటర్ దేవరకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని హాజరై మాట్లాడుతూ డివిజన్ వారీగా పేద, మధ్య తరగతి వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు పెద్ద పీట వేస్తూ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మేయర్, చైర్మన్ ఇలా అన్ని పదవుల్లోనూ కీలక భాగస్వామ్యం కల్పిస్తూ అండగా నిలిచారని తెలిపారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు రాబోయే ఎన్నికల్లో సీఎం జగనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశాల్లో ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, క్లస్టర్-3 పార్టీ అధ్యక్షుడు మంచెం మైబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత



ఎమ్మెల్యే నానికి కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయింపుపై వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మైనార్టీ వర్గాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళనాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్ అబిద్ కోళ్ళ ఫారం సమీపంలోని ఖురేషీ మస్జీద్ కమిటీ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ఆళ్ళనాని శుక్రవారం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. ఖురేషీ మసీదు కమిటీ పెద్దల వినతి మేరకు మసీద్ పక్కన ఉన్న 200 గజాల స్థలాన్ని కేటాయించి, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తనవంతు సహాయ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.10 లక్షలు అందించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఏలూరు నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు రియాజ్ ఆలీఖాన్ మాట్లాడుతూ ఏలూరులో ముస్లిం మైనార్టీలకు ఎమ్మెల్యే ఆళ్ళనాని ఎంతో అండగా ఉంటున్నారని, ముస్లింలకు కమ్యూనిటీ హాళ్ళు, స్కూళ్లు, మసీదులు, కబరస్థాన్ మరమ్మతులకు ఆయన చేయూత అందిస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆళ్ళనాని విజయానికి ముస్లిం మైనార్టీలంతా మద్దతుగా నిలవాలని కోరారు. ఖురేషీ మసీదు కమిటీ పెద్దలు, ఆల్ హదీస్ జమాత్ సభ్యులు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

దళిత, ఆదివాసీ మేనిఫెస్టోకు ప్రాధాన్యతనివ్వాలి

ఏలూరు (టూటౌన్) : దళిత, ఆదివాసీ మేనిఫెస్టోకి రాజకీయ పార్టీలు భరోసా ఇవ్వాలని, రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టో రూపకల్పనలో దీనిలోని అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని డీబీఆర్‌సీ ఏలూరు నగర కో-ఆర్డినేటర్ బలే సురేష్ కోరారు. స్థానిక గన్‌బజారులో ఎమ్మెల్యే ఆళ్ల నానిని డీబీఆర్‌సీ సిబ్బంది, దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ సభ్యులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా దళిత, ఆదివాసీ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను ఎమ్మెల్యే ఆళ్ల నానికి అందజేసారు. ఈ సందర్భంగా నగర కో-ఆర్డినేటర్ సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని దళిత, గిరిజనులు, నాయకులు, మేధావులు, ప్రొఫెసర్లు అందించిన సమాచారం నుంచి దళిత, గిరిజన సమస్యలు, వారి అవసరాల్లో ముఖ్యమైన 10 అంశాలతో ఈ మేనిఫెస్టోను సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీలు దళిత, ఆదివాసీ మేనిఫెస్టో అంశాలపై దృష్టి కేంద్రీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన బడ్జెట్ వాచ్ సభ్యులు మేతర అజయ్ బాబు, వాసే జైపాల్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు తగిన గుర్తింపు, సముచిత స్థానం లభిస్తుందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళ నాని అన్నారు. నూతనంగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కిలాడి దుర్గారావు ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆళ్ళ నాని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ప్రతి ఒక్కరికీ పదవులను కేటాయిస్తున్నారని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ పటిష్టానికి, అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కిలాడి జ్యోతి, బీసీ నాయకులు ఉన్నారు.

రైతులపై దాడులు అమానుషం



ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్లో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేస్తున్న ఆందోళనలపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హర్యానాలోని బీజేపీ ప్రభుత్వం ఈనెల 21న అమానుషంగా చేసిన పోలీసుల దాడులలో ఒక యువ రైతు మరణించడంపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ఏఐటీయూసీ, సీఐటీయూల నాయకులు ఆధ్వర్యం వహించారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా ఏలూరులో బ్లాక్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస డాంగే, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అధ్యక్షతన ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు, సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్షుడు బి.జగన్నాథం, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు. రైతులపై దాడులను వారు ఖండించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, అప్పలరాజు, భజంత్రీ శ్రీనివాస్, కడుపు కన్నయ్య, వి.సాయిబాబు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు దేవి పాల్గొన్నారు.

27న మాదేపల్లిలో డ్వాక్రా సంఘాల సమావేశం

ఏలూరు రూరల్: ఈ నెల 27న మాదేపల్లిలో ఏలూరు రూరల్ మండల డ్వాక్రా సంఘాల సమావేశం నిర్వహించనున్నట్టు ఏపీఎం ప్రభావతి చెప్పారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని వివరించారు. మండలంలో సుమారు 5 వేల మంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపనున్నారు.

సార్వత్రిక ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి

ఏలూరు టౌన్: రాబోయే సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం శక్తివంచన లేకుండా పని చేయాలని, ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేస్తూ శాంతియుత వాతావరణంలో ఎన్నికలు సాగేలా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ఏలూరు జిల్లా ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లతో ఎన్నికల నిర్వహణపై ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల్లో లోపాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. డీటీసీ డీఎస్పీ కే.ప్రభాకరరావు, జిల్లా న్యాయ సలహాదారు కే.గోపాలకృష్ణ, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, ఎస్‌బీ సిబ్బంది ఉన్నారు.

కొవ్వలి ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనుల పరిశీలన

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాలలో పీఎం శ్రీ పథకంలో రూ.5 లక్షలతో అభివృద్ధి చేస్తున్న ఆటస్థలాన్ని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ కర్త బి. సోమశేఖరవవు శుక్రవారం తనిఖీ చేశారు. రూ.10 లక్షలతో నిర్మించిన నూతన గ్రంథాలయాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అకడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, రాష్ట్ర అసిస్టెంట్ సహిత విద్యా సమన్వయ కర్త రాధిక, రాష్ట్ర కోఆర్డినేటర్ కిషోర్, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ, పీడీ సురేష్ ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	--	చామదుంపలు	58
వంకాయలు (తెలుపు)	60	ములక్కాడలు	05, 07, 10
బెండకాయలు	40	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	50	కీరా దోస	36
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
కాలీఫ్లవర్	25-30	అల్లం	120
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	18
క్యారెట్	30-40	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	28	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	28-34	బఠాణి	--
అనబకాయ (1)	25-30	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	27

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	08
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	27

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ కుంకుమార్చన



లలితా సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



విశేష అలంకరణలో లలితామాత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 92వ శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులతో మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో గో పూజ నిర్వహించారు. అనంతరం నగరానికి చెందిన పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో దుర్గాసప్తశతి బృందం ప్రతినిధులు అమ్మవారి ఆవాహన అష్టోత్తర సహస్ర నామ పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు 310 మంది మహిళలు పాల్గొనగా లలితా సహస్రనామ కుంకుమార్చన ఐదేసి సార్లు నిర్వహించారు. రాత్రి స్వామి వారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించారు. శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

2న గుంటూరులో ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా



ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మార్చి 2న గుంటూరులో నిర్వహించనున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళాను జయప్రదం చేయాలని నవసమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్ బాబు పిలుపునిచ్చారు. స్థానిక నవసమాజ్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన దళిత బహుజన నాయకుల సమావేశంలో నేతల రమేష్ బాబు మాట్లాడారు. ఏపీ దళిత మహాసభ అధ్యక్షుడు డాక్టర్ కత్తి పద్మారావు ఆధ్వర్యంలో గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మార్చి 2వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న ప్రత్యామ్నాయ సంస్కృతి మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రత్యామ్నాయ సంస్కృతి మేళా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నాయకులు భూపతి అప్పారావు, ఎల్ఐసీ రాజు, కొత్తపూర్ణ మల్లికార్జునరావు, అర్జి అవినాష్, బగ్గా బాలాజీ, చిన్నారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

26న అండర్ పాస్ ప్రారంభోత్సవం

దెందులూరు: దశాబ్దాలుగా ప్రయాణికులకు తీరని సమస్యగా ఉన్న దెందులూరు- అలుగులగూడెం రైల్వేట్రాక్ గేటు సమస్య పరిష్కారమైంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పలుమార్లు చేసిన విజ్ఞప్తి మేరకు రైల్వేట్రాక్ వద్ద అండర్‌పాస్ సమస్య పరిష్కారమైంది. దెందులూరు - అలుగులగూడెం రైల్వే ట్రాక్ వద్ద నిర్మించిన అండర్ పాస్‌ను ఈ నెల 26న భారత ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని రైల్వే ఏడీ ఈఎస్ గణేశన్ తెలిపారు. శుక్రవారం అండర్ పాస్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 1,500 అండర్ పాస్‌లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. అలుగులగూడెం అండర్‌పాస్ 250 మీటర్లు పొడవు రెండు వైపులా రక్షణ గోడలు రూ.5 కోట్లతో నిర్మించినట్టు తెలిపారు. దెందులూరు, పెదవేగి, ఏలూరు, భీమడోలు మండలాల ప్రయాణికులకు గేటు ఇబ్బందులు తొలగనున్నాయని అన్నారు. రైల్వే అధికారులు ప్రసాద్ , శ్రీనివాస్, నాగేశ్వరావు, నాయకులు మోటపర్తి రాంబాబు పాల్గొన్నారు.

అచ్చమ్మ పేరంటాల తల్లిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, కొఠారు రామచంద్రరావు, కారుమూరి సునీల్ కుమార్

దెందులూరు: గాలాయిగూడెంలోని అచ్చమ్మ పేరంటాల తల్లి ఆలయ అభివృద్ధి, గ్రామ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. చైర్‌పర్సన్ పద్మశ్రీ, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జి కారుమూరి సునీల్ కుమార్, జెడ్పీటీసీ నిట్టా లీలా నవకాంతం ధనరాజు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.కొండలరావు, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని శుక్రవారం అచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాలకు హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తొలుత వారికి ఆలయ కమిటీ, అర్చకులు ఘన స్వాగతం పలికి, సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కొఠారు రామచంద్రరావు, కారుమూరి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉభయ రాష్ట్రాల్లో అచ్చమ్మ పేరంటాల తల్లి ఉత్సవాలకు ఎంతో ఆదరణ ఉందన్నారు. అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, ఎంపీటీసీ సాంగా ప్రమీళా రాణి, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నారు.

అచ్చమ్మతల్లికి పూజలు

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ వీ.జితేంద్ర అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తహసీల్దార్‌కు స్వాగతం పలికి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాలాయగూడెం వీఆర్వో వీ.విష్ణుమూర్తి ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలి

భీమడోలు: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల-1ను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థుల రాత పుస్తకాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక, అన్ని తరగతుల పరీక్షల మార్కులను పరిశీలించి హెచ్ఎం బి.శ్రీనివాసరావు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కరకుమార్, హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారమే ఫోరం లక్ష్యం



ఫోరం చైర్‌పర్సన్ డాక్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న వినియోగదారుడు

భీమడోలు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వినియోగదారుల గ్రీవెన్స్ ఫోరం పని చేస్తుందని ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్‌పర్సన్, రిటైర్డ్ న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ అన్నారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం జిల్లా స్థాయిలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం ఫోరం ఆధ్వర్యంలో బృందం సభ్యులు వినియోగదారుల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. బహిరంగ విచారణ చేసారు. ఆర్డర్లను అమలు చేయడం లేదని, నోటీసులు ఇవ్వకుండా కనెక్షన్లు రద్దు, తొలగిస్తున్నారని, వేలంలో దక్కించుకున్న గృహానికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఉమ్మడి జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, వినియోగదారులు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా అందించి తమ గోడును విన్నవించారు. మరో ఫిర్యాదును పెండింగ్‌లో ఉంచారు. సంబంధిత అధికారులు తగు సూచనలందించారు. ఇప్పటి వరకు ఫోరంకు వచ్చిన 7,829 కేసుల్లో 7,704 కేసులు పరిష్కరించామన్నారు. విద్యుత్ సంస్థ సేవలకు ప్రతి దానికి నిర్ణీత కాలపరిమితి ఉంటుందని, అందుకు విరుద్ధంగా సంస్థ సిబ్బంది నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తే వినియోగదారులు తమ సమస్యలను న్యాయస్థానం దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారం పొందవచ్చని అన్నారు. వి.జనార్ధనరావు, డాక్టర్ రాయసం సురేంద్రకుమార్, ఈఈ జేపీబీ నటరాజన్, డీఈ ఝాన్సీ, ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈ పి.రామస్వామి, విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.